ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
సోమవారం 13 జనవరి 2025



సంక్రాంతి శోభ
● గ్రామాల్లో పండుగ సందడి
● బంధువుల రాకతో గ్రామాలు కళకళ
● హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు

5

వీవీఐటీ విద్యార్థుల దర్గా టు దుర్గా

అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

కాలు దువ్వుతున్న కోళ్ళు

కత్తికట్టి కాలుదువ్వేందుకు కోళ్ళు సిద్ధమైపోతే కట్టలు తెంచుకుని మరీ పందాలకు కోట్లవిలులైన నోట్లు బయటకు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కేవలం మూడురోజుల్లోనే కోట్లాది రూపాయలు చేతులు మారేందుకు కోడిపందాల బరులు సిద్ధమైపోయాయి. భోగి, సంక్రాంతి, కనుమరోజుల్లో పందాలు వేసుకునేందుకు అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వదిలేస్తుండటంతో దీనిని ఆసరా చేసుకుని కొన్నిచోట్ల ఇప్పటికే జూద క్రీడ కూడా మొదలైపోయింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో, ఆదివారం నుంచే బరుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పేకాట,కోతముక్క,గుండాట జోరుగా సాగిపోతున్నాయి. కోడిపందాలైతే సిద్ధంచేసిన బరులతో పనిలేకుండా కృష్ణాతీరంలో సముద్రతీరంలోని కొన్నిచోట్ల పందాలు వేస్తున్నారు. తీర ప్రాంతంలో కోడిపందాల విషయంలో తగ్గేదేలేదంటూ పందెం రాయుళ్ళు కూడా నోట్లకట్లను బద్దలుకొట్టి సంప్రదాయ క్రీడపేరుతో పందాల రూపంలో విరజిమ్ముతూనే ఉన్నారు.

- సంప్రదాయం ముసుగులో కోడి పందాలకు సిద్ధం
- భారీగా బరులు, పేకాట శిబిరాలు
- ఒక్కో ఆటకు ఒక్కో రేటు
- తెలంగాణా నుంచీ పందాలకు బారులు
- పోలీసుల ఆదేశాలు బేఖాతరు



చెరుకుపల్లిమండలం తూర్పుపాలెంలో 30ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరులు



తెనాలి, కొల్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో అధికార పార్టీకిచెందిన కీలకనేతలే ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి కోడిపందాలు, పేకాట, లోనాబయట, కోతముక్క, గుండాట ఆడించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆయా ఆటల నిర్వాహకులకు అప్పగించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా సరే కోడిపందాలు,పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసినా, అందుకు విరుద్ధంగా భారీ బరులను సిద్ధం చేశారు. కొల్లిపర, నాదెండ్ల మండలం సాతులూరు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం మరికొన్నిచోట్ల బరులను పోలీసులు దున్నేశారు. డెల్టాలో మాత్రం బరులు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. వేమూరు మండలం జంపనిలో అయితే ఏకంగా తెనాలి, రేపల్లె ప్రధానరహదారిపై సొంత బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టివెయ్యటం అధికారుల ఆదేశాల అమలుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పెదకూరపాడు మండలం ముస్సాపురం, అమరావతి మండలం లేమల్లె గ్రామంలో భారీ బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద ఎక్కువ శాతం టీడీపీ,జనసేన జెండాలను,భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మరీ సంక్రాంతి సంబరాలకు రారండి అంటూ బహిరంగంగానే ఆహ్వానం పలకటం విశేషం.



కొల్లూరులోని కోడి పందేల బరి

> రేపల్లె నియోజకవర్గంలో కోతముక్క, పేకాట, నెంబర్లాట, రింగ్ ఆట నిర్వహణ, హైదరాబాద్, విజయవాడకు చెందిన వారికి రూ.40లక్షల నుంచి రూ.80లక్షలకు కాంట్రాక్టు అప్పగించారని తెలుస్తోంది. పార్కింగ్ ప్రదేశాన్ని రూ.6లక్షల చొప్పున అధికార పార్టీలోని మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు వేలం పెట్టి రూ.5లక్షలకు పైగానే పాట నిర్వహించారు. బిర్యాని పాయింట్ ఏర్పాటునకు లక్ష రూపాయలు, శీతల పానీయాలు, గుట్కా, ఖైనీ, సిగరెట్లు అమ్ముకొనేందుకు లక్ష రూపాయలు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కోడి పందెం బరులు కూడా రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు తదితర కేటగిరీలుగా ఏర్పాటు చేసి ఆయా బరుల్లో ఆ కేటగిరీకి సంబంధించిన వారు పందాలు కాసుకునే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో...

ఉమ్మడి గుంటూరుజిల్లాలోని రేపల్లెనియోజకవర్గం చెరుకుపల్లిమండలం తూర్పుపాలెం,బాపట్లనియోజకవర్గంలోని పిట్టలవారిపాలెంలో, గుంటూరు, పల్నాడు జిలాల్లో అక్కడక్కడ కోడిపందాలు వేసేందుకు బరులను ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులెవరూ పట్టించుకున్న పరిస్థితి తీర ప్రాంతంలో ఎక్కడా కనపడటంలేదు. రేపల్లె నియోజకవర్గం తూర్పుపాలెంలో ఒక వీఐపీ బరి, ఇతరుల కోసం ఏడుబరులు ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట ఆడుకునేందుకు ప్రత్యేక టెంటులను ఏర్పాటు చేశారు.

చెరుకుపల్లినుంచి నగరం వెళ్ళే ప్రధాన ఆర్అండ్బీ రహదారికి నిబంధనలకు విరుద్ధంగా భారీఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో వెళ్ళే ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనానికి రూ.100లు పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుండగా కార్లకు రూ.200లు ఫీజు వసూలు చేస్తున్నారు. వీఐపీ బరుల వద్ద వచ్చే వీఐపీలకు (మిగతా 5వ పేజీలో)

తీరంలో జూలు విదిల్చిన జూదం

కూటమి ప్రభుత్వం పెద్దలకు అత్యంత సన్నిహితుడుగా పేరున్న వ్యక్తి అతను. అయితే రేపల్లె నియోజకవర్గంలో భారీ ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. నగరంమండలం,ఏలేటిపాలెంలోని సపోట తోట మధ్య భారీ షెడ్డు, రేపల్లెమండలం ఉప్పూడి శివారులో భారీషెడ్డును ఏర్పాటుచేసి రాత్రి 7గంటలకు ప్రారంభించి ఉదయం 6గంటల వరకు పేకాట, కోతముక్క నిర్వహిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ఉభయగోదావరి జిల్లాల నుంచి జూదరలు ఇక్కడకు ప్రతి రోజూ వస్తుంటారు. నిత్యం వచ్చే వారికి ఇక్కడ సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇదే నిర్వాహకుడు గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది మధ్యభాగంలోని రేవులో రేపల్లెటౌన్, నగరం, నిజాంపట్నం ప్రాంతంలో అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో భారీ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. ప్రభుత్వం మారినా ఇప్పటి అధికారపార్టీనాయకుల అండదండలతో అతనే పేకాట శిబిరాలు నిర్వహించడం విశేషం. ఇది ఈ మూడు రోజుల తంతు కాదు. ప్రతి రోజూ జరిగే తంతేనని, ఒక్క కోతముక్క ఆటే రూ. 50 లక్షల వరకు ఉంటుంది. బంకినీ రూపంలో అతనికా రోజుకు రూ.2లక్షల వరకు వస్తాయంటే అక్కడ రోజు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



తూర్పుపాలెంలో పేకాటకోతముక్క ఆడేందుకు ఏర్పాటు చేసిన గుడారం



తూర్పుపాలెంలో కోడిపందాల బరులవద్ద ఏర్పాటుచేసిన కోతముక్క లోనాబయట పేకాటశిబిరాలు

పల్లెకోనలో సిద్ధం కాని పందెం బరి

సంక్రాంతి సంబరాలలో భాగంగా భట్టిప్రోలు మండలం పల్లెకోన వద్ద ఏర్పాటు చేసిన బరి ఇంకా సిద్ధం కాలేదు. నియోజకవర్గంలోని మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన బరులలో పందాలు ప్రారంభం కావడంతో ఇక్కడ కూడా బరి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రింబవళ్ల శ్రమించి సోమవారం ఉదయానికి బరి సిద్ధం చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి కుమారుని చేత సంక్రాంతి సంబరాలు ప్రారంభం చేయించనున్నట్లు సమాచారం.

అదనపు ఆకర్షణగా ఎన్‌ఫీల్డ్ వాహనాలు



కోడి పందాలు బరులు వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిర్వాహకులు ప్రదర్శనగా ఉంచారు. కొల్లూరు, జంపని కోడి పందాల బరుల వద్ద నిర్వాహకులు ప్రతిపాదించిన పందాలు నెగ్గిన పందెంరాయుళ్లకు ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలు బహుమతులుగా ఇవ్వనున్నారు. గత ఏడాది కొల్లూరు మండలం పెసర్లంక వద్ద ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో రెండు ఎన్‌ఫీల్డ్ వాహనాలను నిర్వాహకులు ఒక్కొక్క కోడి పుంజు ఐదు పందాలు గెలిస్తే ఆయా పందెం రాయుళ్లకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఏర్పాటు చేయడంతో ఆయా బరులకు పెద్ద పెద్ద పందాలు కాసే పందెంరాయుళ్లు అధిక సంఖ్యలో వచ్చేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు ఈ పద్ధతి ఎంచుకున్నారు. అసలైన కోడి పందాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మాత్రం నిర్వాహకులు అనధికారిక కోడి పందాలకు తెర లేపారు.



చెరుకుపల్లి : తూర్పుపాలెంలో సిద్ధం చేసిన వీఐపీ కోడిపందాల బరి



కొల్లూరు : పందెం బరిలో ప్రారంభమైన కోడి పందాలు

భోగభాగ్యాల భోగి

పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికే భోగి పండగ

తెలుగునాట మకర సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అంతటి ప్రాముఖ్యత ఉన్న పండుగను తెలుగు ప్రజలు భోగితో మొదలు పెడతారు. తొలిరోజు భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి వేడుకలు నాలుగు రోజులపాటు జరుపుకుంటారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో ఇంటిల్లపాదీ పండుగ వేడుకల్లో మునిగి తేలుతారు. అలా ప్రతి ఇంటికి సంతోషాలను స్వాగతించే తొలి పండుగ దినం భోగి కావడంతో దానికి తెలుగునాట ఎంతో ప్రాధాన్యముంది.



గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగునాట పెద్ద పండుగగా జరుపునే సంక్రాంతిని మొదటిరోజు 'భోగి పండుగగా జరుపుకుంటారు. దక్షిణాయణంలో సూర్యుడు రోజు రోజుకూ భూమికి దూరమవడం వలన చలి విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. ఆ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణానికి ముందురోజుకి చలి తారాస్థాయికి చేరుతుంది. దీంతో ఆ చలిని తట్టుకోవడానికి ప్రజలంతా పెద్దగా మంటలు వేసుకుంటారు. కాల క్రమంలో అదే భోగి మంటలుగా ప్రజల సంప్రదాయంలో భాగమైపోయాయి. ఆ భోగి మంటల్లో తాము ఇప్పటి వరకూ పడిన కష్టాలను, బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చి రాబోయే ఉత్తరాయణంలో తమకు సుఖ సంతోషాలను ఇవ్వాలని కోరుతూ భోగి మంట్లో వేడు కుంటారు.

నెల రోజుల పూజా కార్యక్రమాలు

హిందూ మత విశ్వాసాలు, సంప్రదాయం ప్రకారం, మకర సంక్రాంతికి ముందు రోజున భోగి పండుగ వస్తుంది. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి జనవరి 13, సోమవారం నాడు వచ్చింది. ఈ పండుగను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమిళనాడుల్లోనూ జరుపుకుంటారు. అయితే తెలుగునాట జరిగే సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. భోగి రోజు నుంచే సంక్రాంతి సంబరాలు మొదలవుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ సందళ్లు తారా స్థాయికి చేరతాయి. దాదాపు నెలరోజులపాటు ధనుర్మాస పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి పండుగతో సంక్రాంతి వేడుకల్లోకి ప్రవేశిస్తారు. ధనుర్మాసంలో మహిళలు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి ధనుర్మాస వ్రతం ఆచరిస్తారు. యశోదా తనయుడుకి బాల భోగం సమర్పించి హారతి ఇస్తారు. ఆడపిల్లలు నెలరోజులూ ఇళ్ల ముంగిట్లో కళ్లాపు జల్లి రకరకాల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టి, బంతి, చామంతి, తంగేడు, గుమ్మడి పూలతో అలంకరిస్తారు. శుభ సూచకంగా పసుపు, కుంకుమతో వాటిని పూజిస్తారు. వాటన్నింటికీ ముగింపుగా సంక్రాంతికి ముందురోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేసుకుని చిన్నా, పెద్ద అందరూ ఆ మంటల చుట్టూ చేరి చలికాచుకుంటారు.

- నెల రోజులపాటూ మహిళల ధనుర్మాస పూజలు
- భోగి పండ్లు.. భోగి మంటలు.. బొమ్మల కొలువులతో సందడే సందడి
- చలిని తరిమి, వెచ్చదనాన్ని పంచే భోగి మంటలు
- నెల రోజులపాటు ఇళ్ల ముందు రంగవల్లులతో అలంకారాలు
- ఆనందంతో పాటు.. ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ

భోగి పండుగ రోజున చాలా కుటుంబాల్లో చిన్నారులపై భోగి పండ్లను పోసి పెద్దలు ఆశీర్వదించడం పరిపాటి. అదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పండ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పండ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్థిల్లుతారని చాలా మంది నమ్ముతారు. కాగా భోగి పండ్లలో రేగి పండ్లదే అగ్రతాంబూలం. రేగి చెట్టును సంస్కృతంలో బదరీ వృక్షం అంటారు. బదరీ అనేది ఆ శ్రీమన్నారాయణుడికి మరో నామం. ఆయన పేరుకు ప్రతి రూపంగా భావించి రేగి పండ్లను పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. రేగి పండు సూర్యుడికి ప్రీతిపాత్రమైన ఫలం. సూర్యుడి రంగు, రూపు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణాలను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తలపై పోయడం ద్వారా పిల్లలకు ఆ స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. పిల్లలకు ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని పెద్దల విశ్వాసం. ఈ పవిత్రమైన రోజున ఇంద్ర దేవుడు, వరుణ దేవుడిని పూజిస్తారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు.



మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షూపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షూ లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్ట్స్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాథరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షూ, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.







క్రోసూరులో గంగిరెద్దుల విన్యాసాలు

సంక్రాంతి శోభ

● గ్రామాల్లో పండగ సందడి ● బంధువుల రాకతో గ్రామాలు కళకళ ● హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్‌: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాలు, పల్లెలకు సంక్రాంతి శోభ చేకూరుతుంది. ఎటు చూసినా మహిళలు రంగురంగుల ముగ్గులతో వీధులను అలంకరించే దృశ్యాలు కన్పిస్తున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు వీధుల్లో దర్శన మిస్తున్నాయి. ప్రాతఃకాలంలోనే హరిలో రంగ హరి అంటూ హరిదాసుల సంకీర్తనలు వీనుల విందుగా పల్లె వాసులను నిద్ర లేపుతున్నాయి. వివిధ దేవాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తి గీతాలాపనలు, తిరుప్పావై పఠనాలు, పూజారుల మంత్ర పుష్ప వినియోగాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మరో పక్క దూర ప్రాంతాల నుంచి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకొనే బంధువులతో పల్లెలు కళకళ లాడుతున్నాయి. ధాన్యపు నూర్పిళ్లు, కల్లాల్లో కొత్త ధాన్యం తూర్పారబట్టే దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఎద్దుల మువ్వన్నెల సవ్వడితో దిగుబడులను ఇంటికి చేరవేసే దృశ్యాలు దర్శన మిస్తున్నాయి. శావల్యాపురం మండలం, పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలోని సభ్యులు దాదాపు 70 మంది శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవనున్నారు. కొల్లిపరకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం కలుసుకొని సామూహిక భోజనం చేశారు. దోస్త్ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు.

ఏటా కలిసే సంప్రదాయం

సంక్రాంతి పండగ వచ్చిందటే ఆ గ్రామంలోని ఆ కుటుంబంలోని సభ్యులందరూ కలవాల్సిందే. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ చేసిన పిండి వంటలతో, భోగి మంటల మధ్య సంబరాలు జరుపుకుంటారు. వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలంలోని పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలో సందడి వాతావరణం నెలకొంది. పేరయ్య దంపతులకు గడిపూడి నరసయ్య, పున్నయ్య కుమారులతోపాటు మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సయ్య, పున్నయ్య వృత్తి రిత్యా ఉపాధ్యాయులు. నరసయ్య, పాపమ్మ దంపతులకు గడిపూడి వెంటకరాయుడు, నాగేశ్వరరావులతోపాటు ఐదుగురు కుమార్తెలు కలరు. గడిపూడి పున్నయ్య, బాపనమ్మ దంపతులకు హనుమంతరావు, పేరయ్య కుమారులతోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరికి చెందిన 18 కుటుంబాలు ప్రతి ఏడాది సంక్రాంతి పండగను పురస్కరించుకొని వారంత పోట్లూరు గ్రామంలోని పూర్వీకుల నివాస గృహానికి చేరుకొని సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. గడిపూడి వెంకటరాయుడు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డ్ అవ్వగా నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ ఏఈగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. వీరందరూ శావల్యాపురంలోని వెంకటరాయుడు గెస్ట్‌హౌస్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. గత ఐదేళ్లుగా మొత్తం 70 మంది సభ్యులు కలిసి భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. భోగి మంటలతోపాటు చక్కటి రంగవల్లులు, గుమగుమలాడే పిండివంటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఒకే వంశానికి చెందిన 70 మంది కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వారి వారి వృత్తుల్లో స్థిరపడినప్పటికీ సంక్రాంతి పండగకు అందరూ కలిసి కష్టసుఖాలు, యోగాక్షేమాలు తెలుసుకుంటూ శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవడం గమనార్హం.





గత సంక్రాంతికి కలిసిన నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు

ఎల్లలు దాటిన అనుబంధం

ఆ వంశీయుల అనుబంధం ఎల్లలు దాటింది. ప్రతి సంవత్సరం అందరూ సంక్రాంతి పండగకు కలుసుకునే సంప్రదాయంతో గ్రామీణ వాతావరణానికి శోభ చేకూరింది. కొల్లిపరకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం పరస్పరం కలుసుకున్నారు. దూరప్రాంతాలలో ఎక్కడ ఉన్నా ఏటా కలుసుకునే సంప్రదాయాన్ని ఆ వంశస్తులు పాటిస్తున్నారు. తమ ఆడపడుచులను కూడ పిలిచి పసుపు, కుంకుమలతో పాటు బట్టలు పెట్టి దీవించి పంపడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆ వంశీయులు ఆదివారం ఏర్పాటు చేసిన సామూహిక విందు భోజనానికి 11 వేల మంది హాజరయ్యారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన వారు గ్రామంలోని అందరిని కలిసి పరస్పరం క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సామూహికంగా విందు భోజనం చేశారు.

దుగ్గిరాలను అగ్రగామిగా నిలబెట్టవచ్చు

టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేని తండ్రికి పెద్దకొడుకునైన నేను కాఫీ ఫ్యాక్టరీ స్థాపించానని, ప్రపంచ ప్రఖ్యాత కాంటినెంటల్ ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ అన్నారు. దోస్త్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఆదివారం రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, పోటీలను ప్రారంభించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తన తండ్రి జస్టిస్ చల్లా కొండయ్య తన జీవితంలో టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేనప్పటికీ, తనకు కాఫీ ఫ్యాక్టరీ స్థాపించే అవకాశం దేవుడు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దుగ్గిరాలను 1995లోనే దత్తత తీసుకున్నందున సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చామన్నారు. విద్యపరంగా ఎంతో అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దశాబ్దకాలంగా సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్సై ఎస్. వెంకటరవి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సేవాకార్యక్రమాలు చేపడుతూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేయడం, క్రీడపోటీలు, ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, దోస్త్ ప్రతినిధి చాగర్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దోస్త్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్ బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభించారు. సీసీ ఫ్యాక్టరీ పీఆర్‌ఓ బలరామ్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, దోస్త్‌కు చెందిన జంపాల సుబ్బారావు, గద్దె శ్రీనివాస్, తె.దే.పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, సర్పంచ్ కుషీబాయి, ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, సరళాదేవి పీఈటీలు రవి, జమీర్, జంపాల నీరజాక్షి, బి. సంగమేశ్వరరావు, దోస్త్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



దోస్త్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దుగ్గిరాల సీసీఎల్ (కాఫీ ఫ్యాక్టరీ) చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్



కొల్లిపరలో సామూహికంగా భోజనం చేస్తున్న ఆరిమండవారి వంశీయులు

పండగ పిలుపు కోసం వృద్ధాశ్రమంలో నిరీక్షణ

'మా బాబు వస్తాడు, పండగకు తీసుకు వెళ్తాడు, వాడి పిల్లలను చూడాలని ఉంది, వాళ్లతో కలిసి పండగ చేసుకోవాలని ఉంది' ఓ వృద్ధురాలి ఎదురు చూపు. 'మా మనువళ్లను చూసి చాలా రోజులైంది. నన్ను తీసుకు వెళ్తే వారితో ఆప్యాయంగా మాట్లాడాలనుకుంటున్నాను, వారు ఎలా ఉన్నారో, వెంటనే చూడాలని ఉంది. ఓ వృద్ధుడి ఆత్రం. పండగ అంటేనే అందరూ కలసి జరుపుకొనేది. అందులోనూ సంక్రాంతి మరీ ప్రత్యేకం. పెద్దలు లేనిదే కాంతి లేదు. అయితే సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో ఉంటున్న పలువురు పెద్దలు కన్న పేగు పిలుపు కోసం పరితపిస్తున్నారు. తమను సంక్రాంతికి తీసుకు వెళ్తారని ఎదురు చూస్తున్నారు.



సత్తెనపల్లిలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధుల ఎదురు చూపు

వీవీఐటీ విద్యార్థుల జాతి సమైక్యతా నడక 'దర్గా టు దుర్గా'

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 14వ జాతిసమైక్యత నడక 'దర్గా టు దుర్గా'ను ఆదివారం నిర్వహించారు. గుంటూరు నగరంలోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జెండా ఊపి ఈ సమైక్యతా నడకను ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, డోలాస నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈ నడకలో కళాశాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు, ఎస్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. మార్గమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజ, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లడుతూ దేశ సమగ్రత, సమైక్యతను చాటేలా దర్గా టు దుర్గా పేరుతో ఈ నడక నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ గత 14 ఏళ్లగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ. ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



'దర్గా టు దుర్గా'ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, పక్కన విద్యాసాగర్

ప్రభుత్వ గ్రాంట్‌తోనే ఏఎన్‌యూలో సకాలంలో జీతాలు

● వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం స్పష్టం చేశారు. ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నవంబర్-2024 జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ 5.5 కోట్లు విడుదల చేసిందనీ, ఆ నిధులను ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించినట్లు తెలిపారు. అలాగే నాలుగో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.17.5 కోట్లను విడుదల చేయగా డిసెంబర్ 2024 జీతాలను సీఎఫ్‌ఎంఎస్ ద్వారా చెల్లిస్తున్నామని వివరించారు. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా పెన్షన్‌లు సకాలంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా యూనివర్సిటీలో 140 మంది వరకు క్యాజువల్ వర్కర్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఎటువంటి అవసరం లేకపోయినా వీరిని నియమించారనీ, వీరికి ప్రతినెలా జీతాలు చెల్లించే క్రమంలో వర్సిటీపై ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు నిలిచిపోలేదని, వారికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో ఆర్థిక వ్యవహారాలు పరిగణనలోకి తీసుకుంటే గత మూడేళ్లలో ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో అనేక అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు

(3వ పేజీ తరువాయి)

మాంసాహారం, డ్రైఫ్రూట్స్, బిర్యానీలతో పాటు వివిధ రకాల జ్యూస్‌లు అందించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. భారీ సోఫాలు, ఎయిర్‌కూలర్స్‌ను, విద్యుద్దీపాలను, బెలూన్స్‌ను ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట, ఆడే శిబిరాల్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆదివారం తూర్పుపాలెంలో కోడిపందేలను ప్రారంభించారు.

గత వారంరోజులుగా తీరంలో జోరుగా కోడి పందేలు

తీరప్రాంతంలో ఇంత స్థాయిలో కోడిపందేలు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైన చూసే పరిస్థితి లేదు. ఇష్టానుసారంగా పందెలు వేస్తుంటే పట్టించుకోరా అని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తుంటే, రాజకీయనాయకుల ఒత్తిళ్ళ కారణంగా మేము ఏమీ చెయ్యలేకపోతున్నామంటూ అధికారులు చేతులెత్తివేశారు. దీంతో నగరం,రేపల్లె మండలం గుడ్డికాయలంక, నిజాంపట్నం మండలం పల్లపట్ల, అడవులదీవి, కొత్తపాలెం ప్రాంతాల్లో గత వారంరోజులుగా జోరుగా కోడిపందాలు సాగుతున్నాయి. లక్షలాదిరూపాయలు పందాలు జరుగుతుండగా కొంతమంది పందెంరాయుళ్ళు లక్షల్లో నష్టపోయి వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.

అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

● ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ క్రికెట్ టోర్నీ
● నెలాఖరుకు విజయనగరంలో క్రికెట్ అకాడమీ
● రూ.50 కోట్లతో వైజాగ్ స్టేడియం ఆధునీకీకరణ
● ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో మంత్రి నారా లోకేశ్ ముందుచూపుతో ఉన్నారని చెప్పారు. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతి ఏటా ఎంపీఎల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో నియోజకవర్గ స్థాయికే పరిమితమైన ఈ టోర్నీని ఏసీఏ సహకారంతో ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కో టీంతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు తలపడుతుందని చెప్పారు. 23వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు అవసరమయ్యే మైదానాలతోపాటు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామని, విజయనగరంలో ఈ నెలాఖరు నాటికి క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అలాగే అనంతపురంలో మహిళా క్రికెట్ అకాడమీని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమరావతిలో ఇప్పటికే ఉన్న నవులూరు స్టేడియంతోపాటు మరో అంతర్జాతీయ మైదానం కూడా ఏర్పాటు కాబోతుందన్నారు. మంగళగిరి స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవలే మద్రాస్ ఐఐటీ వారితో స్టేడియం నిర్మాణాలను పరీక్షించినట్లు తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ టోర్నీకి సన్నాహాలు చేస్తున్నామని ప్రకటించారు. రాబోయే కాలంలో ఏపీ నుంచి 25 మంది క్రీడాకారులు ఐపీఎల్‌కి ఎంపికయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. విశాఖపట్నం స్టేడియాన్ని రూ.50 కోట్లతో ఆధునికీకరించనున్నట్టు వెల్లడించారు. ఈ పనులు మార్చి నాటికి పూర్తిచేసి ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం వద్ద ఫోర్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి రానున్న బడ్జెట్‌లో అనుమతి రానుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో తన సొంత నిధులతో 147 పాఠశాలల మైదానాలను ఆధునికీకరించి లాంగ్ జంప్ పిట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా 8 రకాల క్రీడా వస్తువులతో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్

31న విజ్ఞాన్స్ వర్సిటీలో బాల మహోత్సవం


గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31 నుంచి రెండు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిన్నారుల పండగ విజ్ఞాన్ బాల మహోత్సవ్ పోస్టర్లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చిన్నారులకు సంబంధించి భారీ బాల మహోత్సవ్ కార్యక్రమానికి యూనివర్సిటీ వేదిక కాబోతోందన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ వారి ఉన్నతకి కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ చేస్తున్న కృషి అభినందనీయమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు ఆదివారం స్థానిక కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య అధ్యక్షత వహించారు. జీవీ ఆంజనేయులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఏటా రూ.50 లక్షల వరకు విద్యా ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అన్నారు. 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు అందించినట్లు వివరించారు. నాట్కో ఫార్మా వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, బొప్పన ద్వారక ప్రసాద్, పుట్టగుంట వేణుగోపాలరావు, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డాక్టర్ వడ్లమూడి గోవర్ధన్‌రావు, నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, డాక్టర్ బసవపున్నయ్య

క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ఈపూరు, జనవరి12 (ఆంధ్రజ్యోతి): క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా గ్రామంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామస్తులు కలిసికట్టుగా సంప్రదాయ ఆటలు పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, విడపలపాటి హనుమయ్య, కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 564.70 అడుగులు ఉంది. 243.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8853, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, ఔట్‌ఫ్లో వాటర్‌గా 26,863 విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

ఆయకట్టు చివరి రైతులకు సాగునీరు అందిస్తాం

● పీవీపాలెం డీసీ ముంతాజ్‌బేగం

నగరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆయకట్టు చివరి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పీవీపాలెం డీసీ ముంతాజ్‌బేగం అన్నారు. పీవీపాలెం డీసీ పరిధిలోని నీటిసంఘాల డీసీలతో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సాగునీరు అందక పంటలను పండించేందుకు రైతులు డీజిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లపై ఆధారపడ్డారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితిని పూర్తిగా అధిగమించి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కాల్వ పూడికతీతలు పనులు ప్రారంభిస్తామని రైతులకు ఆమె హామీ యిచ్చారు. కార్యక్రమంలో డీసీ అధ్యక్షుడు రుద్రరాజు సత్యనారాయణ, దాసరి శ్రీనివాసరావు, నక్కల పూలరాజ్, బెల్లంకొండ సుబ్బారావు, రామరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు) జనవరి 12(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం పంపిణీ చేశారు. భట్టిప్రోలుకు చెందిన కౌతరపు శ్రీనివాసరావు, షేక్ కాలేషా అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆస్పత్రిలో అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి సిఫారసు లేఖ పంపారు. కౌతరపు శ్రీనివాసరావుకు రూ.25 వేలు, షేక్ కాలేషాకు రూ.55 వేల చెక్కులను వారి కుటుంబసభ్యులకు గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచ్చెళ్లపాడుకి చెందిన పెరికల పోతురాజుకు రూ.10 వేల చెక్కును ఎమ్మెల్యే ఆనందబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, సీఎం చంద్రబాబునాయుడుకు పోతురాజు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బాపట్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక విలియంబూత్ జూనియర్ కళాశాల వద్ద జరిగింది. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం బైక్‌పై బాలకృష్ణపురం వెళుతున్న చదలవాడ మోహనబాబును వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని నల్లకారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోహనబాబుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

32 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం

రేపల్లె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. శనివారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా సీఐ మల్లికార్జునరావు ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని తనిఖీ చేయగా ప్రజాపంపిణీకి చెందిన 32 బస్తాల బియ్యం గుర్తించినట్లు తెలిపారు. పట్టణంలోని రైస్‌మిల్లు యజమాని శ్రీకాకుళం రామకృష్ణ, కస్తూరి సాయిదిలీప్, గుంటూరుకు చెందిన దాసరి బ్రహ్మయ్య, లారీడ్రైవర్ మరో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవం

శ్రీలంక నుంచి రానున్న బౌద్ధ భిక్షువులు

కొల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం వద్దకు సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం నిమిత్తం శ్రీలంక నుంచి 50 మంది బౌద్ధ భిక్షువులు ఇక్కడికి రానున్నారు. ఉదయం 9 గంటలకు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 40 బౌద్ధ స్థూపాల వద్ద 40 నెలల్లో ప్రతినెలా దీపోత్సవం నిర్వహించనున్నారు. బౌద్ధ భిక్షువు బోధిహిన్, యాభైమంది బౌద్ధ ఉపాసకులతో హాజరుకానున్నారు.

సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు

చెరుకుపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడవల్లిలో వరుసగా ఐదో ఏడాది సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గూడవల్లి-నడింపల్లి గ్రామాల కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గూడవల్లిలోని జీఏఆర్ కల్యాణ మండపంలో సంబరాలు జరుగుతాయని వివరించారు.

వేటపాలెంలో జోరుగా కోడి పందేలు

చుండూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం శివారు కోటయ్యస్వామి దేవాలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున కోడి పందేలు ప్రారంభమయ్యాయి. పందేలలో పాల్గొనేందుకు, చూసేందుకు తెనాలి, గుంటూరు, పొన్నూరు ప్రాంతాల నుంచి ఇక్కడికి కార్లు, ద్విచక్ర వాహనాల్లో తరలివస్తున్నారు. ఈ మూడు ప్రాంతాల వారి రాకపోకలకు కోటయ్యస్వామి దేవాలయం అనుకూలంగా ఉంటుంది. మొదటి రోజున సుమారు 150 వరకు కార్లు, వెయ్యికి పైగా బైకుల్లో ఇక్కడికి వచ్చారు. నిర్వాహకులు వీక్షకుల కోసం స్టేజ్ నిర్మాణంతో పాటు 7నుంచి 8 బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. జూదం, గుండాట నడుస్తోంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిమెంట్ రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లకు మహర్దశ కలిగిందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, పోతనకట్టవారిపాలెం, పిట్టువారిపాలెం, కొత్తపాలెం, భవనంవారిపాలెం, కోమలి తదితర గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు కూటమి నాయకులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని, సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. మండలంలోని పలుచోట్ల అస్తవ్యస్తంగా ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు.



భవవవారిపాలెంలో శిలఫలాకంను అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కూటమి నాయకులు తదితరులు

ఇదిలా ఉండగా, భనవారిపాలెం, కోమలి గ్రామపంచాయతీలలో నూతనంగా గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతన షెడ్డుల ప్రారంభోత్సవంలో పంచాయతీరాజ్ డీఈ రాజన్న, పంచాయతీరాజ్ ఏఈ ఎం రఘు, భవనవారిపాలెం సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, సర్పంచ్ యెనుముల పార్వతి, డ్వామా నాగేశ్వరరెడ్డి, ఈవోపీఆర్డీ ఏ ఏలీషాబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అప్జల్ తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏట్రవారిపాలెంలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీశ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ రాజన్న, ఏఈ రమేష్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆశయాలతో ఉన్నతంగా ఎదగాలి

● సీబీఐ పూర్వపు జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ



సభలో మాట్లాడుతున్న సీబీఐ పూర్వపు జేడీ లక్ష్మీ నారాయణ

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువతరం అబ్దుల్ కలాం ఆశయాలతో ఉన్నతంగా ఎదగాలని సీబీఐ పూర్వపు జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రగతి కల్పించేందుకు ఆదివారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. స్థానిక అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ, తులసీ రామచంద్రప్రభు ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను క్రమశిక్షణతో పెంచాలన్నారు. టెక్నాలజీ వల్ల జరుగుతున్న అనర్థాలను గుర్తించి జాగ్రత్త పడాలని విద్యార్థులకు సూచించారు. తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ అధిక జనాభాలో ముందున్న మన దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కూడా రాణించిందన్నారు. చైనా వంటి దేశాల కంటే ముందుకు వెళ్లాలని, అది విద్యార్థుల వల్ల సాధ్యమౌతుందని చెప్పారు. అనంతరం 430 మంది విద్యార్థులకు రూ.80 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటా అంజిబాబు, అరవ రామకృష్ణ, డాక్టర్ ఉదయ్‌భాస్కర్, వల్లభనేని శ్రీనివాస్, ఆప్త టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఖ్యాతి పెంచిన కుమార్

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ శాస్త్ర నిపుణుడిగా దేశ, విదేశాల్లో బాపట్ల ఖ్యాతిని ఇనుమడింప చేసిన ఘనత డాక్టర్ పీఎస్‌జీ కుమార్‌కే దక్కుతుందని జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో కుమార్ మృతికి సంతాపం తెలియజేస్తూ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర గ్రంథాలయ సంఘ కార్యదర్శి రావి శారద అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి 70కి పైగా పుస్తకాలు, 140 వ్యాసాలను కుమార్ రచించారన్నారు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా, రిజిస్ట్రార్‌గా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కుర, జంపని రాజేష్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారి సనిధిలో జస్టిస్ లలిత దంపతులు

పిట్టలవానిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఆదివారం కర్ణాటకకి చెందిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కన్నెగంటి లలిత కుటుంబసభ్యులు వారి కుమార్తె వివాహ ఆహ్వాన శుభలేఖను అమ్మవారికి అందజేయుటకు వచ్చారు. అమ్మవారికి సారెతో శుభలేఖను సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. జస్టిస్ లలిత మాట్లాడుతూ తాను 4వ పర్యాయం శ్రీబగళాముఖి ఆలయానికి వచ్చానని, అమ్మవారి దర్శనం ఎంతో సంతోషదాయకంగా ఉందని అన్నారు. తొలుత ఆలయ వేదపండితులు జస్టిస్ లలితకుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం అందజేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సీనియర్ సహాయకులు కే శ్రీనివాసరావు, చందోలు ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ లలిత దంపతులను సత్కరిస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు

పిట్టలవానిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వేడుకలు సందర్భంగా మండలంలో కోడిపందాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు అన్నారు. చందోలు పోలీసుస్టేషన్‌ను ఆదివారం సాయంత్రం డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను మండల ప్రజలు ప్రశాంతవారాణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బాపట్ల రూరల్ సీఐ బి.హరికృష్ణ, చందోలు ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డీఎస్పీ గోగినేని రామాంజనేయులు మాట్లాడుతూ కోడిపందాల బరులు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవటంతోపాటు స్థలాలిచ్చిన యాజమానులకు నోటీసులు ఇస్తామని డీఎస్పీ తెలిపారు.

జూదం వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

● ఎస్పీ తుషార్ డూడీ



క్రీడాకారుడికి బ్యాట్ అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దంటూ బాపట్ల ఎస్పీ తుషార్ డూడి ఆదివారం క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన క్రీడల్లో ఆదివారం ఆయన పాల్గొని అండర్-14 రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారుడి ని అభినందించి బ్యాట్ బహూకరించారు. క్రికెట్ బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన వెటరన్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ఆనందంగా గడిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సంక్రాంతి పండుగకు దూరప్రాంతాల నుంచి అనేక మంది వారి సొంత ప్రాంతాలకు వస్తుంటారన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కుటుంబ సభ్యులు స్నేహితులతో ఆహ్లాదకరంగా పండుగ జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎవరైన కోడిపందాలు, పేకాట, ఇతర జూదక్రీడలలో పాల్గొన్న, నిర్వహించిన ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన అబ్దుల్ సాద్‌ఉనా యిస్‌కు బ్యాట్ అందజేసి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బాపట్ల జిల్లా ఖ్యాతి జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దొప్పలపూడి రామ్మోహనరావు, అధ్యక్షులు కె.రఘునాథ్, బి.స్టాన్లీ విమల్‌కుమార్, గంటా అంజిబాబు, కరీమ్ తదితరులు ఉన్నారు.

సంక్రాంతి ముసుగులో జూదం ఆడితే చర్యలు

సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందాలు, గుండాట, జూదం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. జిల్లా ప్రజలంతా సంక్రాంతి వేడుకను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

● పట్టణ సీఐ మల్లికార్జునరావు

రేపల్లె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో రేపల్లె పట్టణ, గ్రామాల పరిధిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని పట్టణ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో బేతపూడి లో ఆదివారం దాడులు నిర్వహించి, ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి వెయ్యి రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నింది తులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అనంతరం కోళ్ళకు కత్తులు కట్టేవారిని పిలిపించి వారిపై బైండో వర్ నమోదు చేశారు.

పోలీసుల అదుపులో నిర్వాహకులు

చెరుకుపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగరు శివార్లలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ టి.అనిల్‌కుమార్ తెలిపారు. ఒక కోడిని, రూ.550 నగదు జప్తు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాఠశాల అభివృద్ధే ధ్యేయం

● పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు నాగరాజు



వివిధ రంగాల్లో రాణించిన పూర్వవిద్యార్థులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థుల సంఘనాయకులు

కర్లపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా పూర్వవిద్యార్థుల సంఘం పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు పెనుమెత్స నాగరాజు అన్నారు. కర్లపాలెం మండలం యాజలి హైస్కూల్లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం (1961-2024) నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటూ తమ తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పది సంవత్సరాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కృష్ణంరాజు, శాంతకుమారి, విక్టోరియా, విద్యలో, క్రీడల్లో రాణించిన విద్యార్థులను, నాగరాజు, పార్వతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగరాజు, రత్నశేఖర్, వెంకట్రావు, లక్ష్మీ, తాతాలీలా వరప్రసాద్, గుండ్రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన స్వామి వివేకానంద



బాపట్లలో స్వామివివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీజేపీ నాయకులు, భక్తులు

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని రామకృష్ణమఠంలో ఆదివారం బీజేపీ నాయకులు నిర్వహించారు. ఇనుప నరాలు, ఉక్కుకండరాలు దృఢసంకల్పం ఉన్న వంద మంది యువకులను అందిస్తే భారతదేశ స్థితిగతులు, రూపురేఖలను మార్చగలనని వివేకానంద చెప్పిన మాటలను బీజేపీ నాయకులు గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, మాజీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, బాబునాగేంద్ర, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం పాలకుట్టి హ్యాండ్‌లూమ్స్ అధినేత రామకృష్ణ, పెనుమర్రుకి చెందిన మైనేని సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్వహించిన ఈ పోటీల్లో 42 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువజనసంఘం అధ్యక్షుడు బొగ్గవరపు శివకుమార్‌చంద్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలు జి.గంగమ్మ, రేవతి, గుడారు అంకమ్మలకు సిల్వర్ షీల్డ్స్ బహూకరించారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు కోళ్లపూడి మాధవి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 16వ వార్డులో పద్మశాలీయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 31 మంది మహిళలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నిర్వాహకులు వంగర వీరయ్య, గౌతమ శ్రీనివాసరావు, పద్మశాలీయ సంఘ పెద్దలు, యువత పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు శివకుమార్ చందు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు

దళిత ఉద్యోగులు బాధ్యత మరువకూడదు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



దళిత్ ఎంప్లాయిస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దళిత ఉద్యోగులు తమ బాధ్యత మరువకూడదని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సూచించారు. ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పులి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు పొంది 'పే బ్యాక్ టూ సొసైటీ' అనే నినాదాన్ని మరిచి ఎవరి స్వార్థం కోసం వారు బతకకుండా ప్రతి ఒక్క దళిత ఉద్యోగి బాధ్యతగా ఉండాలన్నారు. దళిత విద్యార్థుల సంక్షేమం కోసం దళితులు ఉన్నత విద్యావంతులుగా ఎదగటానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అటువంటి ప్రయత్నాలకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, రావెల మల్లయ్య, డేగల అర్జున్, బర్మా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

● టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని



కొండుభొట్లపాలెంలో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పల్లం సరోజని

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని తెలిపారు. మండలంలోని కొండుభొట్లపాలెంలో దాసరి బుల్లిబాబు నిర్మించిన మినీ గోకుల్ షెడ్డును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరోజని మాట్లాడుతూ బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కృషితో అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పల్లం జీవన్, టెక్నికల్ అసిస్టెంట్ శ్యామ్,ఫీల్డ్‌అసిస్టెంట్ కూనపురెడ్డి వాసు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొండలు పాల్గొన్నారు.

మానవజాతి జీవన ప్రదాత యల్లాప్రగడ



మాట్లాడుతున్న వైద్యవిద్యాన్ డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్, రావూరి నరసింహవర్మ అదంషఫి తదితరులు

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అపర ధన్వంతరి యల్లాప్రగడ సుబ్బారావు మానవజాతి జీవన ప్రదాత అని ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లినిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైద్యవిద్యాన్ డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్ అన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేగు, కలరా, కేన్సర్, క్షయ వంటి వ్యాధులకు సుబ్బారావు మందులు కనుగొని ప్రపంచ ప్రసిద్ధిపొందారని గుర్తుచేశారు. అనంతరం సాహితిభారతి రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడారు. కార్యక్రమంలో హిందీపండితుడు షేక్ జిలానీ, శామ్యూల్, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, జాకబ్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల కుటుంబసభ్యులతో సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న తాండ్ర సాంబశివరావు, మానం విజేత తదితరులు

బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల కుటుంబసభ్యులతో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలు అనూష, తాండ్ర వెంకటేశ్వరమ్మ, పువ్వాడ రాజకుమారిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి, మాజీ ఎంపీపీ, మానం విజేత, జిల్లా కోఆర్డినేటర్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, రుక్మాదరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



గృహం కోల్పోయినవారికి ఆర్థిక సాయం అందిస్తున్న తెలుగుయువత అధ్యక్షుడు కొలసాని రాము

రేపల్లె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీ పుల్లమెరకకి చెందిన పులివర్తి భాస్కరరావు గృహం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచనలతో తెలుగుయువత అధ్యక్షుడు కొలసానిరాము ఆదివారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు, నల్లపాటి యల్లయ్య, కొక్కిలిగడ్డ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో ఏడాది సర్వీస్‌ను ప్రాతిపదికగా తీసుకోవాలి

» మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం

అందజేసిన హైస్కూల్ హెచ్‌ఎంలు

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు మినిమం సర్వీస్‌ను ఒక సంవత్సరం ప్రాతిపదికగా తీసుకోవాలని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అద్దంకిలో మంత్రి రవికుమార్‌ను కలిసిన హెచ్‌ఎంలు తమ సమస్యలను రవికుమార్‌కు వివరించారు. గత ప్రభుత్వం హెచ్‌ఎంల ప్రమోషన్‌లలో అస్తవ్యస్త విధానాలను అనుసరించడంతో 2023లో ప్రమోషన్‌లు తీసుకున్న హెచ్‌ఎంలు 8 నెలల సర్వీస్‌ను కోల్పోవాల్సి వచ్చిందని, ప్రభుత్వం ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలకు రూపొందిస్తున్న చట్టంలో కనీస అర్హత 2 సంవత్సరాలుగా నిబంధన విధించనున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకుల ద్వారా తెలిసిందని వివరించారు. రెండు అకడమిక్ ఇయర్స్ లేదా ఒక సంవత్సరం సర్వీసు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అయినా 2023లో పదోన్నతి పొందిన హెచ్‌ఎంలు కూడా కౌన్సిలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించే విధంగా విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకు పోవాలని కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని హెచ్‌ఎంలు మహబూబ్‌ఖాన్, ఎం.శ్రీనివాసరావు, రామిరెడ్డి రాఘవ, పి.కృష్ణ ప్రసాద్, షేక్ మీరా వలి, ఇందిరా, రామారావు ఉన్నారు.



మంత్రి రవికుమార్‌తో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు



అద్దంకిలో అరిసెల కోసం రోకళ్లతో బియ్యం దంచుతున్న మహిళలు

గ్రామాల్లో రోకళ్ల చప్పుళ్లు

సంక్రాంతి వంటకాలలో మహిళలు బిజీ బిజీ

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వంటకాలతో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. అన్ని రకాల వస్తువులను, తిండి పదార్థాలను సైతం ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే నేటి యువత కు ఒకప్పటి ఇంటి పిండి వంటల తయారీ ఒకింత కొత్తగానే ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో నేటికి కొంత మంది మహిళలు పిండి వంటలను ఇంట్లోనే తయారు చేసుకుంటున్నారు. మరి కొంత మంది మహిళలు అయితే పిండిని కూడా ఇళ్లలో రోళ్లలో దంచుతున్నారు. అద్దంకి పట్టణంలో సైతం పలు కుటుంబాలు సం క్రాంతి వంటకాలను ఇళ్లలోనే తయారు చేసుకుంటున్నారు. ప్రధానంగా రైతు కుటుంబాలు ఎక్కువగా నివాసం ఉండే కాకానిపాలెం, న ర్రావారిపాలెం, దామావారిపాలెం తదితర ప్రాంతాలలో రోకళ్ల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులందరూ కలిసి పిండి వంటకాల తయారీలో నిమగ్నమయ్యారు.

తీరిన విద్యార్థుల సమస్యలు

» మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో

చందలూరు పాఠశాలకు బస్సు సౌకర్యం

» స్కూల్‌కు వెళ్లే దారిలో వీధి దీపాల ఏర్పాటు

పంగులూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత నెల 7వ తేదీన చందలూరు ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించారు. గ్రామానికి కిలోమీటర్ పైగా దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు బస్సు వసతి కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా, సాయంత్రం వేళ స్టడీ అవర్స్ పూర్తయిన తర్వాత రాత్రిపూట చీకటిలో ఇంటికి రావడం కష్టంగా ఉందని, పాఠశాల వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో గొట్టిపాటికి విన్నవించారు. విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి గొట్టిపాటి చొరవతో పాఠశాలకు చేరుకునేందుకు ప్రధాన కూడలి నుంచి అద్దంకి ఆర్టీసీ అధికారులు పాఠశాల వేళలో బస్సు వసతిని కల్పించగా, విద్యుత్ శాఖ అధికారులు పాఠశాల వరకు విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయడం, గ్రామ పంచాయతీ వీధిలైట్లను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. తాము కోరిన వెంటనే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి గొట్టిపాటికి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



అమ్మవారి కొలుపులో స్థానికులతో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

కనులపండువగా మహాలక్ష్మి గ్రామోత్సవం

అమ్మవారి పూజలో వేలాదిగా పాల్గొన్న భక్తులు

పంగులూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం వైభవంగా జరిగింది. మురకొండ వంశస్తులు పీఠం వద్ద అమ్మవారికి మోయనం సమర్పించారు. ఆదివారం ఉదయం వేద పండితులు పీఠం వద్ద అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో శక్తి స్థలానికి చేరుకుని పురంలో కొలువుదీరిన అమ్మవారి కలశంతో సాగిన గ్రామోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ భక్తులు కలశంపై పూలు, తమపాకులు చల్లుతూ సాగిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది. పుర వీధులలో ఊరేగిన అమ్మవారు తిరిగి పురంలో కొలువు దీరారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకునేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని చినగంజాం జడ్పీ పాఠశాల ఎన్‌సీసీ అధికారి సీహెచ్ సుబ్బారావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు చీరాల ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ సర్టిఫికెట్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ సర్టిఫికెట్ పరీక్షకు పాఠశాలకు చెందిన 29 మంది బాలుర్లు, 19 మంది బాలికలు శనివారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షకు హాజరై, ఆదివారం జరిగిన థియరీ పరీక్షకు రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఎన్‌సీసీ అధికారి ఎస్.నరసింహారావు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ

మార్టూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో ఉన్న లారీ డ్రైవర్ ఎదురుగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా ఆ లారీ ముందుకు కదిలి దాని ముందున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మార్టూరులో హీరోషోరూం ఎదురుగా జరిగింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన లారీతోపాటు మరోలారీ, ప్రైవేటు బస్సు దెబ్బతిన్నాయి. విజయవాడ నుంచి తిరుపతికి 39 మంది ప్రయాణికులతో వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు హీరో షోరూం వద్ద ఓ ప్రయాణికుడి కోసం ఆగింది. ఆ సమయంలో చిలకలూరిపేట వైపు నుంచి మార్టూరు వస్తున్న లారీ మార్టూరు టౌన్ లోపలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్డులోకి ముందు ఆగి ఉన్న ట్రావెల్ బస్సు కారణంగా రోడ్డుపై ఆగింది. అప్పుడే గుంటూరు నుంచి కేరళ కు ఎండు మిరపకాయలను లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఆ లారీ ముందున్న బస్సును ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. మరో ప్రైవేటు బస్సులో ప్రయాణికును తలరించారు. కేసు నమోదు చేశారు.

అభిమానం 'కిక్'

బాలకృష్ణ కటౌట్‌పై మద్యం

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా రిలీజ్ సందర్భంగా అద్దంకి పట్టణంలోని వీఎన్ఎస్ సినీ కాంప్లెక్స్ వద్ద కటౌట్‌ను ఏర్పాటు చేశా రు. ఓ బాలకృష్ణ అభిమానిలో అభిమా నం ఉప్పొంగి ఆదివారం ఏకంగా మాన్స‌న్ హౌస్ మద్యం బాటిల్‌ను తీసుకొని అభిషేకం చేస్తున్నట్లు కటౌట్‌పై పోశారు. దీంతో బాలకృష్ణ అభిమానులు కేరింతలు కొట్టారు.



బాలకృష్ణ కటౌట్‌పై మద్యం పోస్తున్న అభిమాని

120 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని చింతగుంపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మలపెంట జయరావు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద చీరాల శతాయుష్ ఇంటర్నేషనల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ వారు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హాస్పిటల్స్‌కు చెందిన కన్సల్టెంట్ ఆయుర్వేదిక్ డాక్టర్లు సీహెచ్ సింధు, దాసరి ఉత్తరశ్రీ, జి.తేజేష్ పలు రకాల వ్యాధులకు సంబంధించి 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వతరెడ్డి మోహనరావు, గ్రామ పెద్దలు కూనపరెడ్డి కోటయ్య, గంటా సుబ్బయ్య, పల్లపోలు నరసింహారావు, బాపయ్య పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఇంకొల్లు,జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరు గ్రామ శివారుల్లో పేకాట శిబిరంపై ఆదివారం ఎస్సై సురేష్ దాడులు నిర్వహించారు. పేక ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4600 నగదును స్వాధీనం చేసుకున్నారు.


చినగంజాం : కొత్తపాలెం గ్రామ శివారులోని పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పేక ఆడుతున్న ముగ్గురుని అదుపులోనికి తీసుకొని, రూ.1440 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మేదరమెట్ల : కొరిశపాడులో పేకాట ఆడుతున్న 6 గురును అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,690 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేడు ముగ్గుల పోటీలు

మార్టూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం తూర్పుబజారున రామాలయం దగ్గర ముగ్గులు పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అలాగే స్లోసైక్లింగ్, స్లోబైకింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

కోడి పందేలకు రహస్య ఏర్పాట్లు..!



చీరాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి కోడి పందేలు వేసేందుకు పలు గ్రామాల్లో రహస్య ఏర్పాట్లు చేస్తున్నారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని తీరప్రాంత గ్రామాలు, చీరాల మండలం గవినివారిపాలెం, కావూరివారిపాలెం, తోటవారిపాలెం శివారు ప్రాంతాల్లో కోడి పందేల నిర్వహణకు సంబంధించి రహస్య ప్రదేశాలను అనువుగా తయారు చేసుకున్నట్లు విషయం తెలిసిన వారు చెప్తున్నారు. అయితే పందేలలో పాల్గొనే వారికి మాత్రమే సమాచారం ఉంటుందని, లేదంటే పోలీసులు పట్టుకుంటారనే జాగ్రత్తలు పక్కాగా తీసుకుంటున్నారు. ఇప్పటికే నిర్వాహకులు పందేలలో పాల్గొనేవారికి ఎక్కడ ఏ ప్రదేశంలో ఎన్ని గంటలకు పందేలు నిర్వహిస్తారనే సమాచారం పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత పటిష్ఠమైన నిఘా, చర్యలు చేపట్టి కోడి పందేలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.



హ్యాండిక్రాఫ్ట్‌లో ప్రతిభ చూపిన లలితాంబికకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి స్వామి

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సూచించారు. ఆయన బోధనల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కొత్తపట్నం బస్టాండులోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అందుకోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబ ఇటీవల ప్రకటించిన విజన్ డాక్యుమెంట్‌లో కూడా యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన, ప్రతి ఇంటి నుంచి ఒకపారిశ్రామిక వేత్త తయారయ్యేలా ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌షా, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవంలో పాల్గొని ప్రతిభ చూపిన వారికి మంత్రి ప్రశంసాపత్రాలను అందజేశారు.

వివేకానందుని మాటలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే కొండయ్య



వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : సమాజ జాగృతికి, ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు శ్రమ నీ ఆయుధం అయితే ... విజయం నీ బానిస అవుతుంది లాంటి స్వామీ వివేకానంద మాటలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఎంఎం కొండ య్య అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఆర్డీవో కార్యాలయం సమీపంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యునిగా వివేకానంద వేసిన అడుగులు, చేసిన ఉపన్యాసాలు అనుక్షణం సమాజ హితాన్నే కోరాయన్నారు. కార్యక్రమంలో వివేకా నం సేవా సమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య, పలువురు రొటేరియన్లు, టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పలు సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

యద్దనపూడి : పూనూరు గ్రామంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను గ్రామస్థులు నిర్వహించారు. కస్పా చెరువు గట్టు మీద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ నాయకులు అన్నమనేని వెంకటేశ్వరరావు, ఆదిశైవ సంఘ ప్రధాన కార్యదర్శి మూలంరాజు రాజకుమారుశర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు చెరుకూరి రాఘవ చౌదరి, మధు, కొర్రపాటి శివ ప్రసాద్, బత్తుల కోటేశ్వరరావు, గన్నమనేని సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణాలపై దృష్టి

పర్చూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునఃనిర్మాణం చేసేలా దృష్టి సారించాలని, అలాంటి ఆలయాల జాబితాను తయారు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి దేవదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావుకు సూచించారు. ఆదివారం పర్చూరులోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయాన్ని ఏలూరి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి నాగేశ్వరరావు ఏలూరిని ఘనంగా సత్కరించారు. పర్చూరు, యద్దనపూడి, మార్టూరులోని శిథిలావస్థకు చేరిన ఆలయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక దర్శిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తొలిదశలో పునఃనిర్మాణం చేస్తామని ఈవో తెలిపారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

» ఎమ్మెల్యే ఏలూరి

» రూ.కోటి వ్యయంతో నిర్మించిన మహాప్రస్థానం ప్రారంభం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (ఇన్‌సెట్‌లో) శివలింగాన్ని ప్రారంభిస్తున్న ఏలూరి

పర్చూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరులో రూ.కోటి వ్యయంతో దాతల సహకారం, ఎమ్మెల్యే ఏలూరి సౌజన్యంతో నిర్మించిన హిందూ శ్మశానవాటికను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. మహాప్రస్థాన కమిటీ అధ్యక్షుడు కఠారి సురేంద్రబాబు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ దాతల సహకారం, గ్రామస్థుల ఐక్యతకు ఈ శ్మశానవాటిక నిదర్శనమన్నారు. ప్రజల చివరి మజిలీ ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని వసతులతో శ్మశానవాటిక నిర్మాణానికి కమిటీ కృషిని ఆయన అభినందించారు. మహాప్రస్థానం అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కఠారి శ్రీకృష్ణ జ్ఞాపకార్థం కుమారుడు డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, ధర్మపత్ని కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి చూపిన చొరవను ఏలూరి కొనియాడారు. దాతల నుంచి విరాళాలను సేకరించి శ్మశానాన్ని అభివృద్ధి చేసిన కఠారి సురేంద్రబాబును అభినందించారు. అనంతరం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిలో ఎమ్మెల్యే ఏలూరి సహకారం ఎనలేనిదన్నారు. అనంతరం శ్మశానవాటికలోని వివిధ భవనాలు, శిలాఫలకాలను ప్రారంభించిన ఏలూరి అక్కడ ఏర్పాటు చేసిన మహాశివుని విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్, పల్లా గిరిజారాయుడు, నర్రా వెంకట్, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, కోట హరిప్రసాద్, ఒగ్గిశెట్టి నరసింహం, కొల్లా వెంకన్న, మంగళగిరి కోటేశ్వరరావు, రావి సత్యనారాయణ, గడ్డిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా శ్మశానం తనను కలచివేసింది

డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు

'డంపింగ్ యార్డలా శ్మశాన వాటిక' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం తతను కలచివేసిందని, చివరి మజిలీ అయిన మహాప్రస్థానాన్ని తన తండ్రి జ్ఞాపకార్థం తాను భాగస్వామ్యం కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దాతల సహకారం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని రమేష్ అన్నారు.

గోదాదేవికి సారె సమర్పించిన భక్తులు

చినగంజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించే సారెను, అమ్మవారి చిత్రపటంతో గ్రామ పుర వీధులలో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలోని అమ్మవారికి విశేష పూజలు జరిపి, అనంతరం తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు



వేటపాలెం(చీరాల), జనవరి 12(ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తులు స్వామివార్లకు ప్రత్యేక నైవేద్యాలను నివేదించి పారాయణం చేశారు. ఉభయ దాతలు ప్రత్తి వెంకటసుబ్బారావు, అనంతలక్ష్మి దంపతు లు, అనంగనాగసాయి, మల్లిక దంపతులు పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.



బాపయ్య కళాశాలలో కలిసిన 1998-99 పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

వేటపాలెం(చీరాల), జనవరి 12(ఆంధ్రజ్యోతి) : బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల 1998-99లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలిశారు. ఆనాటి స్మృతులను మననం చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు (పర్చూరు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కారంచేడు గ్రామంలోని డి.రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీలను ఏలూరి, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్‌తో కలసి ప్రారంభించారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి

అద్దంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పలు కుటుంబాలను ఆదివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. మండలంలోని కలవకూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తన్నీరు ఏడుకొండలు కుటుంబసభ్యులను రవికుమార్ పరామర్శించారు. శింగరకొండలో పూజారి కోట శ్రీరామచంద్రమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబసభ్యులను మంత్రి రవికుమార్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడు పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డులోని దామావారిపాలెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేముల ప్రసన్నబాబు, 7వ వార్డులోని నర్రావారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన మాదాల రామాంజనేయులు మాతృమూర్తి శేషమ్మ, 8వ వార్డులోని నర్రావారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన పరిటాల ఆదినారాయణ తండ్రి హనుమంతరావు, 16వ వార్డు భాగ్యనగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు టీవీ నరసింహారావు, 17వ వార్డు పెరికపాలెంలో ఇటీవల మృతి చెందిన మద్దా ఆంజనేయులు మాతృమూర్తి నాగేశ్వరమ్మ, 18వ వార్డు కట్టకిందపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన వాగుమడుగు హరే రాంబాబు భార్య శింగమ్మ, 19వ వార్డు దామావారిపాలెంలో ఇటీవల మృతి చెందిన బొర్రా పున్నయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినన 7వ వార్డు నర్రావారిపాలెంకు చెందిన నర్రా శివయ్య, 17వ వార్డు పెరికపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సన్నెబోయిన చిన్నమ్మ, కోటేశ్వరమ్మను మంత్రి పరామర్శించారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

బల్లికురవ : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పల్లపు ఆంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి గొట్టిపాటి అన్నారు. మండలంలోని అంబడిపూడిలో పల్లపు ఆంజనేయులు ఇల్లు ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఆదివారం మంత్రి రవికుమార్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ మండల నేతలు కొండేటి ఇజ్రాయిల్, దద్దాల అంజయ్య ఉన్నారు.

పంగులూరు : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు గ్రామాలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. రేణంగివరంలో మరణించిన సంపతి రోశయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. ఇదే గ్రామంలో ఈ నెల 2న గుండెపోటుతో మరణించిన మట్టకొయ్య వక్కియ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ నెల 3న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అన్నపు రెడ్డి వెంకటకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముప్పవరంలో మృతి చెందిన ధూళిపాళ్ల నాగరత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట నేతలు బొర్రెడ్డి ఓబులరెడ్డి, మాజీ సర్పంచ్ అమృతపూడి ఏసోబు, ఎర్రం శ్రీనివాసరెడ్డి ఉన్నారు.